బలగం TV
BALAGAM
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 08 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4


## సెలవుల్లో ఉన్న సిబ్బంది విధుల్లో చేరాలి

- కేంద్ర హెూంమంత్రి అమిత్ షా



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర హెూంమంత్రి అమిత్ షా కీలక ఆదేశాలు జారీ చేశారు. పారామిలిటరీ బలగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, సెలవుల్లో ఉన్న సిబ్బందిని తక్షణమే విధుల్లో చేరాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. సరిహద్దుల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

అలాగే సరిహద్దు రాష్ట్రాల సిఎంలతో అత్యవసర సమీక్ష చేపట్టారు. సరిహద్దు రాష్ట్రాల సీఎంలు, సీఎస్‌లు, డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అమిత్ షా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జమ్మూకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్, ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, సిక్కిం, పశ్చిమ బెంగాల్ సిఎంలు, లద్దాఖ్ ఎల్జీ హాజరయ్యారు.



## ఆపరేషన్ సిందూర్ దేశానికి గర్వ కారణం

- క్యాబినెట్ భేటీలో ప్రధాని మోడీ
- రాష్ట్రపతితో ప్రధాని భేటీ
- విదేశీ పర్యటన వాయిదా వేసుకున్న మోడీ

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

ఆపరేషన్ సింధూర్ దేశానికి గర్వకారణమని ప్రధాని నరేంద్రమోదీఅన్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సేనలు దాడి చేసి ఉగ్రవాదులను హతమార్చడం దేశానికి గర్వకారణమని ప్రధాని అన్నారు. ప్రధాని అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆపరేషన్ సిందూర్ గురించి సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా.. భారత సేనలు చేపట్టిన చర్యను క్యాబినెట్‌లోని మంత్రులంతా బల్లలు చరిచి సమర్థించారు.

### రాష్ట్రపతితో ప్రధాని భేటీ

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమయ్యారు. పాకిస్తాన్ ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకొని భారత సైన్యం జరిపిన దాడుల గురించి రాష్ట్రపతికి వివరించారు. ఆపరేషన్ సిందూర్, సరిహద్దులో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని మోడీ తన యూరప్ పర్యటనను వాయిదా వేసుకున్నారు.

## నేడు అఖిల పక్ష సమావేశం

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్రవాద స్థావరాలపై సాయుధ దళాలు నిర్వహించిన దాడి గురించి వివరించడానికి కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరన్ రిజుజు ఆ సమావేశం గురించి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "2025 మే 8న ఉదయం 11 గంటలకు దిల్లీలోని పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని కమిటీ రూమ్: జీ–074లో ప్రభుత్వం అఖిల పక్ష నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసింది" అని ఆయన చెప్పారు.

## ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తున్నాం

- కాంగ్రెస్ పార్టీ



బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ను కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. ఈ విషయంలో భారత భద్రతా దళాలకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించింది. భారత్ చేపట్టిన దాడుల నేపథ్యంలో కాంగ్రెస్ కమిటీ బుధవారం అత్యవసరంగా సమావేశం అయ్యింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్, సచిన్ పైలట్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

'ఆపరేషన్ సిందూర్' పేరుతో సాహసోపేత నిర్ణయం తీసుకున్న భారత దళాలను చూసి గర్విస్తున్నామని మల్లికార్జున ఖర్గే అన్నారు. 'ప్రభుత్వం చేపట్టిన చర్యలపై చర్చించేందుకు మా పార్టీ అత్యవసరంగా సమావేశమైంది. ఆపరేషన్ సిందూర్ పేరుతో మన సాయుధ దళాలు తీసుకున్న సాహసోపేత నిర్ణయం పట్ల గర్విస్తున్నాం. సైనికుల దృఢ సంకల్పం, దేశ భక్తికి మేం సెల్యూట్ చేస్తున్నాం' అని సమావేశం అనంతరం ఖర్గే అన్నారు. ఈ దాడిపై రాహుల్ గాంధీ కూడా స్పందించారు. ఆర్మీ బలగాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. 'ఆపరేషన్ సిందూర్‌పై ఈ సమావేశంలో చర్చించాము. మన సాయుధ దళాలకు కాంగ్రెస్ పార్టీ నుంచి పూర్తి మద్దతు ఉంటుంది' అని రాహుల్ అన్నారు.

# కేవలం 25 నిమిషాలే..

- 9 టెర్రర్ క్యాంప్స్ ..24 మిసైల్స్
- ఉగ్రవాదుల శిక్షణ కేంద్రాలపై భారత్ దాడులు
- సుమారు 80 మంది ఉగ్రవాదులు హతం
- పహల్గాం దాడికి ప్రతీకారం

# ఆపరేషన్ సిందూర్ విజయవంతం








బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు జరిపిన దాడికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఆపరేషన్ సింధూర్ పేరుతో భారత సైన్యం పీవోకే, పాకిస్తాన్ లోని ఉగ్రస్థావరాలను టార్గెట్ గా చేసుకుని దాడి చేసింది. పాకిస్తాన్‌లోనూ, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోనూ ఉన్న తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను వైమానిక క్షిపణి దాడులతో ధ్వంసం చేసింది. బుధవారం ఉదయం 1.05 గంటలకు ప్రారంభమైన 'ఆపరేషన్ సిందూర్' కేవలం ఇరవై ఐదు నిమిషాలలోనే ముగిసింది. పాకిస్తాన్ తేరుకునే లోగానే లష్కరే తోయిబా, జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థల మౌలిక సదుపాయాలు నేలమట్టమయ్యాయి. బహవల్‌పూర్‌లో జైషే మహమ్మద్‌కు చెందిన మర్కజ్ సుభాన్ అల్లా, మురిద్కేలో లష్కరే తోయిబాకు చెందిన మర్కజ్ తాయిబా, తెహ్రా కలాన్‌లో జైషే మహమ్మద్‌కే చెందిన సర్జాల్ స్థావరాలు నామరూపాలు లేకుండా పోయాయి. వీటితో పాటు సియాల్‌కోట్‌లో హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన మెహమూనా జోయా, బర్నాలాలో లష్కరే తోయిబాకు చెందిన మర్కజ్ అహ్లే అదిత్‌పై కూడా దాడి జరిగింది. కోట్లీలో జైషే మహమ్మద్‌కు చెందిన మర్కజ్ అబ్బాస్, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన మస్కర్ రహీల్ షామిద్, ముజఫరాబాద్‌లో లష్కరేకు చెందిన షావై నల్లా శిబిరం, జైషే మహమ్మద్‌కు చెందిన సయేద్నా బిలాల్ శిబిరం కూడా భారత దళాల వైమానిక దాడిలో ధ్వంసమయ్యాయి. ఈ దాడులలో ఉగ్రవాదులు పెద్ద సంఖ్యలోనే హతమయ్యారని వార్తలు వచ్చాయి. 'న్యాయం జరిగింది. జైహింద్' అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సైన్యం పోస్ట్ పెట్టింది.

### ఆపరేషన్ సింధూర్ పూర్తి వివరాలు

మే 6 న అర్ధరాత్రి 1.05 గంటల నుంచి 1.30గంటల వరకు ఆపరేషన్ సింధూర్ జరిగింది. అంటే 25 నిమిషాలు 24 మిసైళ్లతో పీవోకే,పాకిస్తాన్ లోని ఉగ్రస్థావరాలపై దాడి చేసింది భారత్ సైన్యం. పక్కా ఇంటిలిజెన్స్ సమాచారంతో పీవోకే, పాకిస్తాన్ లోని తొమ్మిది టెర్రర్ క్యాంపుల వైపు దూసుకెళ్లాయి. పక్కా ప్లానింగ్ తో టెర్రర్ క్యాంపులపై బాంబులు జారవిడిచి వెనుదిరిగాయి. ఇదంతా మెరుపు వేగంతో జరిగిపోయింది. పాక్ సైన్యం గుర్తించి ప్రతిస్పందించేలోగా ఐఏఎఫ్ ఫైటర్ జెట్లు తిరిగొచ్చేశాయి. అత్యాధునిక సాంకేతిక సాయంతో గురిచూసి వదిలిన మిసైల్స్ టెర్రర్ క్యాంపులను పేల్చేశాయి. జైషే మొహమ్మద్ (జెఎం), లష్కరే తోయిబా (ఎల్ఇటి), హిజ్బుల్ ముజాహిదీన్‌లతో సంబంధం ఉన్న 80 మందికి పైగా ఉగ్రవాదులుఈ దాడుల్లో మరణించారని ఉన్నత వర్గాలు తెలిపాయి. ఇండియన్ ఆర్మీ దాడులు చేసిన కాసేపటికే సోషల్ మీడియాలో వీడియోలు ప్రత్యక్షమయ్యాయి. పాక్ పౌరులు ఈ దాడులను తమ ఫోన్లలో రికార్డు చేసి ట్విట్టర్ లో పోస్టు చేశారు.

ఇండియా దాడిని అటు పాకిస్తాన్ కూడా ధృవీకరించింది. ఇండియాకు ఏ క్షణంలోనైనా బుద్ధి చెబుతాం..ప్రతీకార దాడి చేస్తామని హెచ్చరించింది. మరో వైపు పాకిస్తాన్, ఇండియా దాడులను ప్రపంచం తట్టుకోలేదని ఐక్యరాజ్యసమితి తెలిపింది. సంయమనంతో ఇరు దేశాలు సామరస్యంగా చర్చించుకోవాలని సూచించింది.

జమ్మూకశ్మీర్ లో ఇటీవల జరిగిన పహల్గామ్ టెర్రర్ అటాక్ లో కొత్తగా పెళ్లైన నవ వధువరూలు కూడా ఉన్నారు. నేవీ అధికారి వినయ్ ను టెర్రరిస్ట్ హతమార్చిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో మృతదేహం దగ్గర అతడి భార్య ఏడుస్తున్న దృశ్యం అందరినీ కలిచివేసింది. టెర్రర్ అటాక్ లో హిందూత్వాన్ని టార్గెట్ చేసినట్టుగా మతం అడిగి మరీ చంపిన వారి వైఖరికి జవాబుగా హిందూత్వ ప్రతీకారంగా, మహిళల సింధూరాన్ని గుర్తు చేసేలా ఈ దాడులకు ఆపరేషన్ సిందూర్ అని పేరు పెట్టినట్టుగా తెలుస్తోంది.

### మసూద్ అజార్ కుటుంబసభ్యులు హతం

భారత్ చేపట్టిన దాడుల్లో జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబసభ్యులు హతమయ్యారు. 10 మంది కుటుంబసభ్యులు, మరో నలుగురు అనుచరులు మరణించినట్లు మసూద్ అజార్ వెల్లడించాడు. భారత్ దాడుల్లో మసూద్ అజార్ అక్క, బావ, మేనల్లుడు, అతని భార్యతో పాటు మరో ఐదుగురు మరణించినట్లు చెప్పాడు. జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయం బహవల్‌పూర్‌లోని జామియా మస్జీద్ సుబాన్ అల్లాహ్ ప్రాంతంలో జరిగిన దాడిలో మరణించినట్లు తెలిపాడు.భారత్ చేపట్టిన దాడుల్లో జైషే ప్రధాన కేంద్రం కూడా ఉంది. అంతర్జాతీయ సరిహద్దుకు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న బహవల్‌పూర్‌లోని మర్కజ్ సుబాన్ అల్లాహ్‌పై భారత సైన్యం దాడి చేసింది. దీన్ని జైషే మహ్మద్‌కు ఆపరేషనల్ హెడ్‌క్వార్టర్‌గా గుర్తిస్తారు. పుల్వామా దాడి సహా చాలా కుట్రలకు ఇక్కడే ప్రణాళిక రచించారు. దీనినే మసూద్ తన ఇంటిగా కూడా వినియోగిస్తాడు. ప్రస్తుతం జైషే నెంబర్–2గా ఉన్న ముఫ్తీ అబ్దుల్ రవూఫ్ అస్గర్, మౌలానా అమర్ ఇతరుల కుటుంబ సభ్యులు ఇక్కడే ఉంటున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా పాకిస్థాన్ రేంజర్లు నియంత్రణ రేఖ వెంబడి కాల్పులకు తెగబడ్డారు. పదిమంది భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోయారని, పలువురు గాయపడ్డారని సైనిక వర్గాలు తెలిపాయి.

## ఉగ్రదాడి మృతులకు న్యాయం కోసమే ఆపరేషన్

- కల్నల్ సోఫియా ఖురేషీ
- ఆపరేషన్ సిందూర్ వివరాలు వెల్లడి




బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

పహల్గాం ఉగ్రదాడి మృతులకు, వారి బంధువులకు న్యాయం చేకూర్చడానికే సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు జరిపాయని కల్నల్ సోఫియా ఖురేషీ విలేకరులకు తెలిపారు. తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకొని వాటిని విజయవంతంగా ధ్వంసం చేశామని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌పై వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, కల్నల్ ఖురేషీ విలేకరుల సమావేశం నిర్వహించారు. కచ్చితత్వంతో కూడిన సామర్థ్యంతో, సాంకేతికపరమైన ప్రత్యేక ఆయుధాలతో, వార్‌హెడ్లను జాగ్రత్తగా ఎంపిక చేసుకొని దాడులు జరిపామని, పౌరులు, వారి ఆస్తులకు నష్టం జరగకుండా జాగ్రత్త పడ్డామని వ్యోమికా సింగ్ వివరించారు. దాడులలో పాక్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదని స్పష్టం చేశారు. దాడుల సమయంలో ఎంతగానో సంయమనం ప్రదర్శించామని చెప్పారు. అయితే ఒకవేళ పాకిస్తాన్ దుస్సాహసానికి పాల్పడి పరిస్థితి తీవ్ర రూపం దాల్చితే మాత్రం దీటుగా బదులిచ్చేందుకు భారత సాయుధ దళాలు సంసిద్ధంగా ఉన్నాయని అన్నారు. పాకిస్తాన్ లోనూ, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోనూ ఉన్న ఉగ్ర స్థావరాల చిత్రాలను, వాటిపై జరిగిన దాడుల ఫుటేజీలను ఈ సమావేశంలో కల్నల్ ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ప్రదర్శించారు.

విశ్వసనీయ నిఘా సమాచారం ఆధారంగానే ఆపరేషన్ సిందూర్ లక్ష్యాలను ఎంచుకున్నామని కల్నల్ ఖురేషీ చెప్పారు. ఉగ్రవాద చర్యలకు కుట్ర పన్నేది ఆ స్థావరాలలోనే అని అన్నారు. ప్రజలు, వారి ఆస్తులకు ఎలాంటి నష్టం కలగని రీతిలో ఉగ్ర స్థావరాలను ఎంపిక చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఉగ్రవాద స్థావరాలపై దాడులకు దారితీసిన కారణాలను వివరిస్తూ 'గత మూడు దశాబ్దాలుగా పాకిస్తాన్ ఓ క్రమ పద్ధతిలో ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నిర్మిస్తోంది. అక్కడే నియామకాలు జరుగుతాయి. దాడులు ఎలా జరపాలో చెబుతారు. అందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. లాంచ్‌పాడ్లు కూడా ఉంటాయి. ఈ శిబిరాలు పాకిస్తాన్‌లో, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉన్నాయి' అని చెప్పారు.

దాడులకు ప్రాతిపదికను విక్రమ్ మిస్రీ తెలియజేశారు. 'పహల్గాం దాడిపై దర్యాప్తు జరిపినప్పుడు ఉగ్రవాదుల కమ్యూనికేషన్ నోట్స్ బయటపడ్డాయి. ప్రత్యక్షసాక్షులు చెప్పిన వివరాల ప్రకారం ఉగ్రవాదులను గుర్తించాము. దర్యాప్తు సంస్థలకు అదనపు సమాచారం కూడా అందింది. మా నిఘా వర్గాలు కుట్రదారులు, మద్దతుదారుల ఊహాచిత్రాలను రూపొందించాయి' అని ఆయన చెప్పారు. సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడడంలో పాకిస్తాన్‌కు సుదీర్ఘ చరిత్ర ఉన్నదని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉగ్రవాదులకు పాకిస్తాన్ స్వర్గధామంగా మారిందని, అంతర్జాతీయంగా పేరున్న ఉగ్రవాదులు అక్కడ ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు.

'గత నెల 22న పాకిస్తానీ ఉగ్రవాదులు, పాక్ శిక్షణ ఇచ్చిన లష్కరే తోయిబా ఉగ్రవాదులు జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడి చేశారు. 2008 నవంబర్ 26న ముంబయి దాడుల తర్వాత ఎక్కువ మంది ప్రాణాలను బలిగొన్న ఉగ్ర దాడి ఇదే. పహల్గాంలో జరిగిన దాడి అత్యంత క్రూరమైనది. బాధితులలో ఎక్కువ మందిని అతి సమీపం నుంచి, వారి కుటుంబసభ్యుల సమక్షంలోనే తలలపై గురి పెట్టి కాల్చి చంపారు. పర్యాటకులను కాల్చిన విధానం వారి కుటుంబ సభ్యులను ఉద్దేశపూర్వకంగా గాయపరచింది' అని కల్నల్ ఖురేషీ పేర్కొన్నారు. పహల్గాం దాడి జరిగి పక్షం రోజులు గడిచినప్పటికీ పాకిస్తాన్ తన భూభాగంలోనూ, తన అధీనంలోని ప్రాంతంలోనూ ఉన్న ఉగ్రవాద స్థావరాలు, మౌలిక సదుపాయాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన గుర్తు చేశారు. పైగా ఖండనలు, ఆరోపణలతో కాలయాపన చేసిందని అన్నారు. భారత్‌పై మరిన్ని దాడులకు పాకిస్తాన్‌లోని ఉగ్రవాద మాడ్యూల్స్ పథకం పన్నాయని భారత నిఘా వర్గాలు ఉప్పందించాయని, దీంతో వాటిని అడ్డుకోవడం, ముందస్తు చర్యలు తీసుకోవడం తప్పని సరైందని చెప్పారు. 'తగిన విధంగా స్పందించడానికి, సీమాంతర ఉగ్రవాద దాడులను అడ్డుకోవడానికి భారత్ తనకున్న హక్కును ఈ రోజు ఉదయం ఉపయోగించుకుంది. ఈ దాడులు పరిమితమైనవే. తీవ్రమైనవి కావు. బాధ్యతాయుతంగానే వ్యవహరించాం. ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం, మన దేశానికి పంపే అవకాశమున్న ఉగ్రవాదులను నిర్వీర్యం చేయడం పైనే దృష్టి సారించాం' అని అన్నారు. పహల్గాం ఉగ్రదాడిపై ఐక్యరాజ్యసమితి భద్రతామండలి గత నెల 25న చేసిన ప్రకటనను కల్నల్ ఖురేషీ ప్రస్తావించారు.

## హైదరాబాద్‌లో మాక్ డ్రిల్

### సాయంత్రం 4 గంటలకు మోగిన సైరన్‌లు

### యుద్ధం వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పౌరులకు అవగాహన



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ అభ్యాస్ పేరుతో బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. నగరంలోని గోల్కొండ, కంచన్‌బాగ్, సికింద్రాబాద్, మల్లాపూర్‌లలో మాక్ డ్రిల్ నిర్వహించారు. సరిగ్గా సాయంత్రం 4 గంటలకు నగరంలో పలుచోట్ల సైరన్లు మోగాయి. ప్రధాన కూడళ్లు, అపార్ట్‌మెంట్ల వద్ద కూడా సైరన్లు మోగించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు, సహాయక సిబ్బంది వ్యవహరించాల్సిన విధానంపై అధికారులు అవగాహన

## దేశ ప్రజలు జాతీయ ఐక్యతను ప్రదర్శించాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

'ఆపరేషన్ సిందూర్' పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఒక భారతీయుడిగా తాను ఎంతో గర్వపడుతున్నానని అన్నారు. ఈ కీలక సమయంలో దేశ ప్రజలందరూ ఏకతాటిపై నిలిచి, జాతీయ ఐక్యతను ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో 'జైహింద్' అంటూ తన స్పందనను తెలియజేశారు. అలాగే, ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో రేవంత్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. తాజా పరిస్థితుల దృష్ట్యా పర్యటనను ముగించుకుని తక్షణమే హైదరాబాద్‌కు తిరిగి రావాల్సిందిగా సూచించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భారత సైన్యం చేపట్టిన ఈ సాహసోపేత చర్య దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్న వేళ, రాష్ట్ర ప్రభుత్వం కూడా అప్రమత్తంగా వ్యవహరిస్తూ తగిన చర్యలు

## భారతీయుడిగా గర్వపడుతున్నా

- మాజీ సీఎం కేసీఆర్



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

భారత సైన్యం ప్రదర్శించిన తన సైనిక పాటవానికి ఒక భారతీయుడుగా తాను గర్వపడుతున్నాని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. ఉగ్రవాదం, ఉన్మాదం ఏరూపంలో ఉన్నా.. ఏ దేశంలో వున్నా.. ప్రపంచ మానవాళికి నష్టం కలిగించేదే తప్ప లాభం చేకూర్చేదికాదు. ఉగ్రవాదం అంతం కావాల్సిందే అని కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో పాజిటివ్‌గా ఆలోచించే ప్రపంచ శక్తులన్నీ ఏకమై, ఉగ్రవాదాన్ని అంతమొందిస్తేనే శాంతి సామరస్యాలు నెలకొంటాయి. భారత సైన్యం ఎంత వీరోచితంగా దాడులు చేసిందో అంతే అప్రమత్తంగా వుండి దేశరక్షణలో మేమెవరికి తీసిపోము అన్నట్టుగా వారికి శక్తి సామర్థ్యాలుండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను అని కేసీఆర్ పేర్కొన్నారు.

## ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవాలి

- మంత్రులు, అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలి
- సైనిక బలగాలకు సంఘీభావంగా నేడు ర్యాలీ
- సీఎం రేవంత్‌రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దేశ భద్రతా బలగాలు ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్మీ, పోలీసు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర అత్యవసర విభాగాలతో తాజా పరిణామాలను సమీక్షించిన ముఖ్యమంత్రి ఇలాంటి సందర్భాల్లో తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. భారత సైనిక బలగాలకు సంఘీభావంగా, అండగా ఉన్నామని సందేశం ఇవ్వడానికి తెలంగాణ ప్రజల తరఫున గురువారం సాయంత్రం 6 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు. "తీవ్రవాద వ్యతిరేక పోరాటాలకు సంఘీభావ ప్రకటన" గా ఈ ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు.

ఇలాంటి సమయాల్లో రాజకీయాలకు, పార్టీలకు సంబంధించిన వివాదాలకు తావులేదని చెప్పారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనడానికి సర్వసన్నద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆయా విభాగాలకు స్పష్టంగా పలు ఆదేశాలిచ్చారు. మంత్రులు, అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలి. అత్యవసర సర్వీసులు అందించే విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సెలవులు రద్దు చేయాలి. ఉద్యోగులంతా అందుబాటులో ఉండాలి. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలి. వైద్యం, పౌరసరఫరాలు, విద్యుత్ వంటి అత్యవసర సేవల విభాగాలన్నీ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి. పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచారం కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పరిస్థితిని ఆసరా చేసుకుని సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు చేసే వారి పట్ల పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలని, సైబర్ సెక్యూరిటీ విభాగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా తప్పుడు సమాచారం వ్యాప్తి జరక్కుండా ఫేక్ న్యూస్ ప్రచారం చేసే వారిపైన కఠినంగా వ్యవహరించాలి. ఫేక్ న్యూస్‌ను, పుకార్లు వ్యాప్తిని అరికట్టడానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు.

రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంకి అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు సున్నిత ప్రాంతాల్లో 24 గంటలు అప్రమత్తంగా ఉండటంతో పాటు భద్రతను పెంచాలి. హైదరాబాద్ నగరంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన సందర్భంగా పీస్ కమిటీలతో సమావేశం కావాలని చెప్పారు. పాత నేరస్తులు, ఇతర నేర చరిత్ర కలిగిన వారిపట్ల పోలీసులు అప్రమత్తంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్మీ, పోలీసు, ఇతర అత్యవసర విభాగాలకు చెందిన ఉన్నతస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

**22 మంది మావోయిస్టులు మృతి**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని బీజాపూర్ జిల్లా కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. బుధవారం ఉదయం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 22 మంది మావోయిస్టులు మృతి చెందారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు భద్రతా సిబ్బంది గాయపడ్డారు. వారందరూ ప్రమాదం నుంచి బయటపడ్డారని అధికారులు తెలిపారు. ఇప్పటివరకు వందలాది నక్సలైట్ దాక్కున్న ప్రదేశాలు, బంకర్లను ధ్వంసం చేశామని, పేలుడు పదార్థాలు, డిటోనేటర్లు, ఆహార నిల్వలు, రోజువారీ ఉపయోగించే వస్తువులను స్వాధీనం చేసుకున్నామని ఒక అధికారి చెప్పారు.

డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ), కోబ్రా, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్), బస్తర్ ఫైటర్స్, ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్ (సీఏఎఫ్) కు చెందిన బలగాలు సంయుక్తంగా ఈ కూంబింగ్ ఆపరేషన్‌లో పాల్గొంటున్నాయి. ఈ కీలక ఆపరేషన్‌ను అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీ) వివేకానంద సిన్హా స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిసింది. సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) రాకేశ్ అగర్వాల్, బస్తర్ రేంజ్ ఐజీ పి. సుందరరాజ్ లు ఎప్పటికప్పుడు ఆపరేషన్ పురోగతిని సమీక్షిస్తూ, క్షేత్రస్థాయిలోని బలగాలకు దిశానిర్దేశం చేస్తున్నారు. అటవీ ప్రాంతంలో ఇంకా మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో బలగాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఎదురు కాల్పులు కొనసాగుతున్న నేపథ్యంలో, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇప్పటివరకు(ఈ సంవత్సరంలో)రాష్ట్రంలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో 146 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో 129 మంది బీజాపూర్‌తో సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్‌లో మరణించిన వారే ఉన్నారు.

## ఉత్తరప్రదేశ్‌లో రెడ్ అలర్ట్

**బలగం టీవీ, లక్నో**



ఆపరేషన్ సిందూర్‌తో భారత్ – పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ లో రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్ డీజీపీ ప్రశాంత్‌కుమార్ కీలక ఆదేశాలు జారీచేశారు. ఒకవేళ పాకిస్థాన్ ప్రతిదాడులకు పాల్పడినా భద్రతా బలగాలకు సహకరించేందుకు పోలీసులు అందుబాటులో ఉండాలని సూచించారు. 'ఉత్తరప్రదేశ్ పోలీసులు అలర్ట్‌గా ఉన్నారని, కావాల్సిన వనరులు అందుబాటులో ఉన్నాయని, రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి రక్షణ కల్పించేలా తాము సిద్ధమయ్యామని యూపీ డీజీపీ తెలిపారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ప్రతి జిల్లా పోలీసులకు, కమిషనరేట్స్‌కు, రాష్ట్రంలోని అన్ని పోలీస్ యూనిట్స్‌కు డీజేపీ నుంచి ఆదేశాలు వెళ్లాయి.

## ప్రపంచం మరో యుద్ధాన్ని భరించలేదు

- **ఐరాస చీఫ్ గుటెర్రస్**

**బలగం టీవీ, హైదరాబాద్**

పాకిస్థాన్‌పై భారత్ చేపట్టిన సైనిక చర్య పట్ల ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ స్పందించారు. ఇరు దేశాల మధ్య సైనిక ఘర్షణను ప్రపంచం భరించలేదని, ఇరుపక్షాలు అత్యంత సంయమనం పాటించాలని ఆయన పిలుపునిచ్చినట్లు ఆయన ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్ తెలిపారు. నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారత్ చేపట్టిన సైనిక చర్యల పట్ల సెక్రటరీ జనరల్ తీవ్ర ఆందోళన చెందుతున్నారని డుజారిక్ మంగళవారం వెల్లడించారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత్ క్షిపణి దాడులు చేసినట్లు ప్రకటించిన కొద్దిసేపటికే ఈ ప్రకటన వెలువడింది.



## నాట్కో హైస్కూల్ ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

**బలగం టీవీ, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మున్సిపాలిటీ కేంద్రంలో నాట్కో ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన నాట్కో జిల్లా ఉన్నత పాఠశాల భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీ శాఖ మంత్రి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరై పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. నాట్కో పరిశ్రమ నిర్వాహకులు సీఎస్ఆర్ నిధులతో కొత్తూరు ఉమ్మడి మండల ప్రజలకు నాణ్యమైన విద్యా, వైద్యం అందించటం కోసం చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



## పాతబస్తీలో హైడ్రా కూల్చివేతలు

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం బండ్లగూడ మండలం పరిధిలో హైడ్రాఅధికారులు అక్రమ కట్టడాలను కూల్చివేశారు. అక్బర్ నగర్ ప్రాంతంలోని సర్వే నంబర్లు 303 నుంచి 306 వరకూ ఉన్న ప్రభుత్వ భూమిలో 2000 గజాల మేర కబ్జా చేసిన స్థలాన్ని గుర్తించిన హైడ్రా బృందం, అక్కడ అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను కూల్చివేసింది. హైడ్రా దాడుల నేపథ్యంలో భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. ఇందులో భాగంగా, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు లేదా చెరువుల్లో చేపట్టిన నిర్మాణాలపై ఎవరైనా సమాచారమిస్తే, వాటిపై వెంటనే చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికార వర్గాలు స్పష్టం చేశాయి. ఈ కూల్చి వేతలకు వ్యతిరేకంగా పలువురు ఎంఐఎం కార్పొరేటర్లు, మహిళా నాయకులు హైడ్రా అధికారులపై నిరసన చేపట్టారు. హైడ్రాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన చేపట్టిన ఎంఐఎం నేతలు, మహిళా నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## కర్తార్‌పూర్ కారిడార్ మూసివేత

**బలగం టీవీ, చండీగఢ్**



పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో డేరాబాబా నానక్ వద్ద ఉన్న కర్తార్‌పూర్ కారిడార్‌ను బుధవారం మూసివేసినట్లు సీనియర్ అధికారి తెలిపారు. కర్తార్‌పూర్ కారిడార్ పంజాబ్‌లో గురుదాస్‌పూర్ జిల్లాలోని డేరాబాబా నానక్ మందిరాన్ని, పాకిస్తాన్‌లోని దర్బార్ సాహిబ్ గురుద్వారాలను కర్తార్‌పూర్ కారిడార్ కలుపుతుంది. ఈ కారిడార్‌ను నిలిపివేశామని, దర్బార్ సాహిబ్ గురుద్వారాను సందర్శించేందుకు యాత్రికులను అనుమతించరని అన్నారు. పాకిస్తాన్‌లోని గురుద్వారాలో ప్రార్థనలు చేసేందుకు బుధవారం ఉదయం పలువురు యాత్రికులు కర్తార్‌పూర్ కారిడార్ చేరుకున్నారు. అయితే యాత్రికులందరినీ తిరిగి రావాల్సిందిగా ఆదేశించినట్లు వెల్లడించారు. గురునానక్ దేవ్ 550వ జయంతి సందర్భంగా 2019, నవంబర్ 9న కర్తార్‌పూర్ కారిడార్‌ను ప్రారంభించారు. గురునానక్ అంతిమ విశ్రాంతి స్థలమైన గురుద్వారాకు అన్ని మతాలకు చెందిన భారతీయ యాత్రికులు ఏడాది పొడవునా వీసా లేకుండా ప్రయాణించేందుకు అనుమతి ఉంది. భారత్ , పాకిస్తాన్‌ల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. రోజుకు 5,000 మంది యాత్రికులు గురుద్వారాను సందర్శించవచ్చు.



## సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ పదవీకాలం పొడిగింపు

**బలగం టీవీ, న్యూఢిల్లీ**

కేంద్ర దర్యాప్తు సంస్థ ( సీబీఐ ) డైరెక్టర్ ప్రవీణ్ సూద్ పదవీకాలాన్ని కేంద్ర ప్రభుత్వం బుధవారం ఒక సంవత్సరం పొడిగించింది. ప్రధాని మోడీ నేతృత్వంలోని భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీలతో కూడిన ఎంపిక కమిటీ సోమవారం నిర్వహించిన సమావేశంలో సీబీఐ డైరెక్టర్ పదవీకాలాన్ని పొడిగించాలని నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపిక కమిటీ సిఫారసుల ఆధారంగా, కేబినెట్ నియామకాల కమిటీ (ఎసిసి) ఏడాది పాటు ఆయన పదవీకాలాన్ని పొడిగించేందుకు ఆమోదం తెలిపింది. 2023 మే 25న ఆయన రెండేళ్ల కాలానికి సిబిఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రవీణ్ సూద్ కర్ణాటక కేడర్‌కి చెందిన 1986 బ్యాచ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపిఎస్) అధికారి. ఆయనను సిబిఐ డైరెక్టర్‌గా నియమించిన సమయంలో కర్ణాటక డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)గా విధులు నిర్వహిస్తున్నారు. 1964లో హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో జన్మించిన ప్రవీణ్ సూద్ ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం ఐపిఎస్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు.

## 18 ఎయిర్ పోర్టులు మూసివేత

- **200కు పైగా విమానాలు రద్దు**

**బలగం టీవీ, హైదరాబాద్**




ఆపరేషన్ సిందూర్ తర్వాత ముందస్తు జాగ్రత్తగా దేశవ్యాప్తంగా బుధవారం 200కి పైగా విమానాలను రద్దు చేశారు. శ్రీనగర్, లేహ్, అమృత్‌సర్, చండీగఢ్ సహా 18 విమానాశ్రయాలు తాత్కాలికంగా మూసివేశారు. భద్రతా కారణాల రీత్యా విమానాల రాకపోకలు రద్దు చేసినట్లు అధికారులు వెల్లడించారు.సరిహద్దులకు సమీపంలో ఉన్న జమ్మూ, అమృత్సర్, లేహ్, చండీగఢ్, ధర్మశాల ఎయిర్‌పోర్టులను కూడా తాత్కాలికంగా మూసివేశారు. ఈ విమానాశ్రయాల ద్వారా వెళ్లే విమానాల రాకపోకలు నిలిచిపోయాయి.

## భారత్‌లో ఉగ్రవాదానికి స్థానం లేదు

- **ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**బలగం టీవీ, హైదరాబాద్**



భారత్ భూభాగంలో ఉగ్రవాదానికి స్థానం లేదు.. భారతదేశం ఎల్లప్పుడూ ఉన్నతంగా నిలుస్తుంది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మన శాంతిపై ఉగ్రవాదం చేసినప్పుడు.. మన ఐక్యత బలంతో, మన సైనికుల ధైర్యంతో మనం ప్రతిస్పందిస్తామని హరీశ్‌రావు అన్నారు. భారత సైన్యాన్ని చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. వారికి వెన్నుదన్నుగా నిలబడుతామని ఆయన స్పష్టం చేశారు. జై హింద్ అని హరీశ్‌రావు నినదించారు.

## నేను చెప్పినట్టుగానే పాక్‌ను దెబ్బకొట్టారు

- **కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్**

**బలగం టీవీ, హైదరాబాద్**



తిరువనంతపురం లోక్‌సభ సభ్యుడు శశి థరూర్ తాజాగా కేంద్ర ప్రభుత్వం, సాయుధ బలగాలను ప్రశంసిస్తూ తన స్పందనను 'ఎక్స్' సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "ఈ రోజు నా దేశాన్ని చూసి గర్వపడుతున్నాను. జై హింద్!" అని ఆయన ఒక పోస్టులో పేర్కొన్నారు. మరో పోస్టులో "ఉగ్ర లక్ష్యాలపై కచ్చితమైన, ప్రణాళికాబద్ధమైన, నిర్దిష్టమైన దాడులు జరిగాయి. గత వారం నేను చెప్పినట్లుగానే, గట్టిగా, తెలివిగా దెబ్బకొట్టారు. నేను భారత ప్రభుత్వాన్ని అభినందిస్తున్నాను. మన సాయుధ బలగాలకు సంపూర్ణంగా మద్దతుగా నిలుస్తాను" అని థరూర్ తెలిపారు. "ఇదే సమయంలో, వివాదం మరింత విస్తరించకుండా ఉండేలా మనం వ్యవహరించాం. మన వాదనను స్పష్టం చేశాం. ఆత్మరక్షణ కోసం చర్య తీసుకున్నాం. అదుపులేని ఉద్రిక్తతలను నివారించడానికి సంబంధిత వర్గాలన్నీ వివేకంతో వ్యవహరించాల్సిన సమయం ఇది" అని థరూర్ పేర్కొన్నారు.

## వేములవాడలో

# 80 ఫీట్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపడతాం

**-రోడ్డు సర్వే పనుల పరిశీలన**

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

వేములవాడలో 80 ఫీట్ల మేర రోడ్డు విస్తరణ పనులు చేపడతామని,వేములవాడ పట్టణంలోని మూలవాగు నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ, భూసేకరణ చేస్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూమంగళవారం వేములవాడ పట్టణంలో వివిధ శాఖల అధికారుల ఆధ్వర్యంలో సర్వే చేస్తుండగా పనులు పరిశీలించామని, గజానికి ధర ఎంతో ప్రభుత్వం ఇంకా నిర్ణయించలేనందున,గజానికి ధర ఎంతో ప్రకటించలేదని స్పష్టం చేశారు. రోడ్డు డిజైన్, నిర్మాణ గడువు తదితర అంశాలపై ఎలాంటి ప్రకటన చేయబడలేదని వివిధ మీడియాల్లో వచ్చింది సరికాదని ప్రకటన లో తెలిపారు.

# పెళ్లి కావడం లేదని యువకుడు ఆత్మహత్య..



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

పెళ్లి జరగడం లేదంటూ ఓ వ్యక్తి మానసిక ఆవేదనకు గురై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కిసాన్ దాస్ పేటలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల, స్థానికుల వివరాల ప్రకారం కిషన్ దాస్ పేటకు చెందిన ఒగ్గు మహేష్ (23) గొర్ల మేకల కాపరిగా జీవిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా ఇంట్లో తనకు పెళ్లి చేయాల్సిందిగా తల్లిని కోరాడు. సరేనని తల్లి రాజవ్వ సంబంధాలు చూసే ప్రయత్నం చేస్తున్నది. బుధవారం ఉదయం గొర్ల మేకలకు వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో తల్లికి చెప్పి ఇంటి వెనకాలనే ఉన్న బింగి మల్లయ్య వ్యవసాయ బావిలో ఉన్న చెట్టుకు నైలాన్ తో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయ బాయి వద్దకు వెళ్లిన కొంతమంది వ్యక్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న తల్లి తనయుడు తోపాటు స్థానిక కాలనీవాసులు వ్యవసాయ బాయి వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు వేలాడుతూ మృతి చెందినట్లు కనిపించడంతో బోరున విలపించారు.. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తులో భాగంగా పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ప్రొబేషనరీ ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

# పాకిస్తాన్‌కు గట్టిగా గుణపాఠం చెప్పాలి

**మాజీ మండల కో-ఆప్షన్ మెంబర్ మహ్మద్ ఆజ్జు**



**బలగం టీవీ, బోయినిపల్లి**

"రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం. 78 సంవత్సరాలుగా భరతమాత ఎదుర్కొంటున్న దాడులకు, నష్టాలకు, బలిదానాలకు, అవమానాలకు, సహనానికి, ముగింపు పలకాల్సిన సమయం ఆసన్నమయింది.శత్రుశేషం లేకుండా శాశ్వత పరిస్కారంతో భరతమాత నుదుట సింధూరం దిద్దాలి. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై మన రక్షణ దళాలు నిర్వహించిన సర్జికల్ దాడులను నేను స్వాగతిస్తున్నాను. మరో పహల్గామ్ ఘటన మళ్లీ జరగకుండా పాకిస్తాన్ కు గట్టి గుణపాఠం నేర్పించాలి. పాకిస్తాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను పూర్తిగా నాశనం చేయాలని అన్నారు. భారత్ మాతకి జై" మాజీ మండల కో-ఆప్షన్ మెంబర్ మహ్మద్ ఆజ్జు.



# ఉన్నత చదువులు చదివి వివిధ రంగాలలో రాణించాలి

**అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థిని-విద్యార్థులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

**బలగం టీవీ, బోయినిపల్లి**

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు.పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బోయినిపల్లి మండలం రత్నం పేట గ్రామానికి చెందిన విద్యార్థుల ను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ శాలువాతో ఘనంగా సన్మానించి, సత్కరించారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, వివిధ రంగాలలో రాణించాలనే లక్ష్యం పెట్టుకోవాలని, విద్య ద్వారా మనం నైపుణ్యాలు, జ్ఞానం మరియు వివిధ రంగాల గురించి అవగాహన పెంచుకోవచ్చని, ఉన్నత చదువులు మనకు మంచి భవిష్యత్తును అందిస్తాయని అన్నారు.అనంతరం విద్యార్థిని-విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్ ఆజ్జు, బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ బత్తిని కమల్ గౌడ్, కళ్ళేపెల్లి కృష్ణమూర్తి, మండల బిఆర్ఎస్ బిసి సెల్ అధ్యక్షులు గురిజాల కోటి,గొండ సుధాకర్,ర్యాగల్ల బాలకిషన్, గురిజాల శ్రీనివాస్,ర్యాగల్ల తిరుపతి కందరపు వెంకటేష్,కన్నం అక్షయ్, బోరుగని లింగరావు తదితరులు ఉన్నారు.

# సీఎం ప్రతిరోజూ 18 గంటలు కష్టపడుతుండ్రు..

**-బండి సంజయ్ కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలి..**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సీఎం రేవంత్ రెడ్డి దుబ్బారా ఖర్చు చేయకుండా, రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్నాడని,ఆడంబరాలకు పోకుండా ప్రతినిత్యం 18 గంటల కష్టపడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు పోతున్నాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కెటిఆర్ బండి సంజయ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలను కాంగ్రెస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలకు అర్థమయ్యేలా చెప్తే దానిని బిజెపి బిఆర్ఎస్ వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని,కెటిఆర్, బండి సంజయ్ మాటలు కోటలు దాటుతున్నాయని అన్నారు.

గత ప్రభుత్వం చేసిన అప్పులను ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే గత అసెంబ్లీ సమావేశంలో సి ఎం రేవంత్ రెడ్డి చెప్పడం జరిగిందని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు వారు కట్ చేసి ప్రచారం చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ లు పెడితే బిఆర్ఎస్, బీజేపీ వారు వాట్స్ అప్ యూనివర్సిటీ లు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు.గతంలో బిఆర్ఎస్ నాయకులు ధనిక రాష్ట్రం అంటే బిజెపి నాయకులు ఎందుకు ఖండించలేదు అని అన్నారు.

కాళేశ్వరం పేరిట తెలంగాణ సంపదను బీఆర్ఎస్ నాయకులు దోచుకున్నారని అన్నారు.రాష్ట్ర ఆదాయాన్ని పెంచే మార్గాలు ప్రజా ప్రభుత్వంలో చేపడుతుంటే బీఆర్ఎస్ నాయకులు అడ్డుకట్ట వేస్తున్నారని అన్నారు.కంచ గచ్చి బౌలి భూమల విషయంలో కూడా ప్రభుత్వం పై ఆరోపణలు చేశారని,కేంద్ర మంత్రి కిసాన్ రెడ్డి కంచ గచ్చీబౌలి భూముల విషయం పై సోషల్ మీడియా లో పెట్టిన పోస్టాలను ఎందుకు తీసివేశారని అన్నారు.విభజన హామీలను ఏమయ్యాయని,బీజేపీ అసమర్థత కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుందని అన్నారు. రోడ్డు వేసామని గొప్పలు చెప్తున్నారు, మీరూ రోడ్డు వేసి టోల్ టాక్సీ వేసి డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు.బిసి కుల గణన మేము చేస్తే,కుల సర్వే అంటున్నారని,వాళ్ళు ఏం మాట్లాడుతున్నారో వారి విజ్ఞత కే వదిలేస్తున్నామని అన్నారు. రాహుల్ గాంధీ చెప్పినట్లు గా దేశమంతా కుల గణన చేసి తీరాల్సిందే అని,రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో డిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తే, ధర్నా చేస్తే 50 మంది ఎంపీలు, 15 రాష్ట్రాల బీసీ సంఘం నేతలు పాల్గొనడం జరిగిందని అన్నారు.

ఎస్సి వర్గీకరణ అమలు చేయడం జరుగుతుందని,కవిత బిసి లకు నాయకత్వం వహించాల్సిన అవసరం లేదన్నారు.గత ప్రభుత్వం హయంలో ఏ రంగానికి కూడా పాలసీ లేదని,ప్రజా ప్రభుత్వంలో అన్ని రంగాలకు పాలసీ లు చేస్తున్నామని అన్నారు. మీరు మీ ప్రభుత్వ హయంలో హెలికాప్టర్ వాడితే తప్పులేదు కానీ, మా మంత్రులు వాడితే తప్పా అని,ఆనాడు మీరు, మీ నాన్న హెలికాప్టర్ ఎక్కి కరీంనగర్ సిరిసిల్లలో దిగవచ్చు కానీ మా మంత్రులు వాడితే మీకు నచ్చడం లేదా అని ప్రశ్నించారు.

బీజేపీ బీఆర్ఎస్ రెండు ఒకటే అని,ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి పెరిట ముందుకు పోతే చూస్తూ ఓర్వలేక పోతున్నారని అన్నారు. బండి సంజయ్ ఎల్లారెడ్డి పేటలో వారు కేంద్ర మంత్రిగా మాట్లాడినా మాటలు ఖండిస్తు న్నామని, బండి సంజయ్ వాస్తవాలు తెలుసు కోని మాట్లాడాలని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేస్తున్నామని అన్నారు. రైతులు తేడాను గమనించాలని,రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని అన్నారు.సి ఎం రేవంత్ రెడ్డి రైతును రాజుగా చేయాలనీ ముందుకు పోతున్నామనిఅన్నారు.

వర్షానికి తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని,సన్నం వడ్లను కూడా కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు.తూకం వేసిన మూడు రోజుల్లోనే రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుం దని, కలెక్టర్ నాయకత్వంలో వడ్ల కొనుగోలు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ నాగుల సత్య నారాయణ గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవానికి హాజరైన చల్మెడ

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో ఎల్లమ్మ జాతరకు బుధవారం వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ హరిచరణ్ రావు, సీనియర్ నాయకులు మ్యాకల రవి, ఆర్ సి రావు, హరికృష్ణ, కట్ట తిరుపతి, రాజిరెడ్డి, పరశురాములు, శ్రీనివాస్, రెడ్డవేని పరుశరాములు, బండారి శ్రీనివాస్, రవి, నరేష్ తదితరులు ఉన్నారు.





# మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్.. కౌన్సిలింగ్ నిర్వహణ..

**బలగం టీవీ, ఆదిలాబాద్**

ఆదిలాబాద్ జిల్లాలో మైనర్ల డ్రైవింగ్‌ను అరికట్టేందుకు పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, మైనర్లు నడుపుతున్న 295 వాహనాలను తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టుబడిన 295 మంది మైనర్లకు వారి కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ మాట్లాడుతూ, మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు నిండని వారు వాహనాలు నడపడానికి తగిన సామర్థ్యం కలిగి ఉండరని ఆయన తెలిపారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, అంతేకాకుండా ఇతరులకు కూడా ప్రమాదం కలిగించే ప్రమాదం ఉందని ఎస్పీ ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు, ప్రజలు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని ఆయన సూచించారు. మైనర్లు వాహనాలు నడిపినా లేదా వారికి వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులు, ఇతర వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు.

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఆకస్మిక తనిఖీలు

**బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల**

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. రజిత పోతుగల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆవునూరు, గూడెం ఆరోగ్య ఉప కేంద్రాలను మరియు లింగన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా డాక్టర్ రజిత హాజరు పట్టికలను, మందుల నిల్వల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వైద్య అధికారులు మరియు సిబ్బందితో కలిసి కేంద్ర ఆరోగ్య కార్యక్రమాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా గర్భవతుల నమోదు రికార్డులు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ వివరాలు, గర్భిణుల ఆరోగ్య పరీక్షల కార్డులను పరిశీలించిన డాక్టర్ రజిత గారు, సాధారణ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేలా ప్రోత్సహించాలని ఆశా కార్యకర్తలకు మరియు సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి.ఓ.ఎం.హెచ్.ఎన్ డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్, డి.ఐ.ఓ డాక్టర్ సంపత్ కుమార్, లింగన్నపేట వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# శతకొట్టిన జెమీమా రోడ్రిగ్స్

**సౌతాఫ్రికాపై 23 పరుగుల తేడాతో భారత్ ఘన విజయం**

**ఫైనల్‌కు దూసుకెళ్లిన ఇండియా**



**బలగం టీవి, హైదరాబాద్**

టీమిండియా స్టార్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ తన బ్యాట్ పవర్ ఏంటో మరోమారు చూపించింది. శ్రీలంక వేదికగా జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో బుధవారం సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో జెమీమా రోడ్రిగ్స్(101 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 123) శతకం సాధించి భారత్ గెలుపులో కీలక పాత్ర పోషించింది. దాంతో భారత మహిళల జట్టు ఫైనల్‌కు చేరింది.

మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 337 పరుగులు చేసింది. దీప్తి శర్మ(84 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 93) తృటిలో శతకాన్ని చేజార్చుకుంది. జెమీమాతో కలిసి ఐదో వికెట్‌కు 122 పరుగులు జోడించింది. సఫారీ బౌలర్లలో మసబట, నదినే, మ్లబా రెండేసి వికెట్లు తీసారు.

అనంతరం సౌతాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 314 పరుగులే చేసి ఓటమిపాలైంది. అన్నరీ డెర్కెన్స్(80 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 81), క్లోట్రయాన్(43 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లతో 67) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో అమన్‌జ్యోత్ కౌర్ మూడు వికెట్లు తీయగా.. దీప్తి శర్మ రెండు, శ్రీ చరణి, ప్రతీకా రావల్ తలో వికెట్ తీసారు.

ఈ సిరీస్‌లో భారత్‌కు ఇది మూడో విజయం కాగా.. సౌతాఫ్రికాకు వరుసగా మూడో పరాజయం. దాంతో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఈ టోర్నీ నుంచి సౌతాఫ్రికా నిష్క్రమించింది. శ్రీలంకతో సౌతాఫ్రికా మరో మ్యాచ్ ఆడాల్సి ఉంది. అనంతరం ఆదివారం జరిగే ఫైనల్లో శ్రీలంకతో భారత్ తలపడనుంది.






# కేకేఆర్‌కు చెన్నై షాక్

**బలగం టీవి, హైదరాబాద్**

ఐపీఎల్ 2025 సీజన్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు చెన్నై సూపర్ కింగ్స్ షాక్ ఇచ్చిది. . బుధవారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో సీఎస్‌కే 2 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆఖరి ఓవర్‌లో మహేంద్ర సింగ్ ధోనీ( 17 నాటౌట్) సిక్స్ బాది చెన్నై విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ ఓటమితో కేకేఆర్ ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టంగా మారాయి.



మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 179 పరుగులు చేసింది. అజింక్యా రహానే(33 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 48) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకోగా.. ఆండ్రీ రస్సెల్(21 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 38), మనీష్ పాండే(28 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 36 నాటౌట్) పర్వాలేదనిపించారు. చెన్నై బౌలర్లలో నూర్ అహ్మద్(4/31) నాలుగు వికెట్లు తీయగా.. అన్షుల్ కంబోజ్, రవీంద్ర జడేజా తలో వికెట్ తీసారు.

అనంతరం 180 పరుగుల లక్ష్యచేధనలో సీఎస్‌కేకు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఓపెనర్లు ఆయుష్ మాత్రే(0), డెవాన్ కాన్వే(0) డకౌట్‌గా వెనుదిరిగారు. అరంగేట్ర ప్లేయర్ ఉర్విల్ పటేల్ మెరుపులు మెరిపించినా.. ఎక్కువసేపు క్రీజులో నిలబడలేకపోయాడు. అశ్విన్(8), జడేజా కూడా నిరాశపర్చడంతో సీఎస్‌కే 60 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో బ్యాటింగ్‌కు వచ్చిన డెవాల్డ్ బ్రెవిస్.. విధ్వంసం సృష్టించాడు. ముఖ్యంగా వైభవ్ అరుణ్ బౌలింగ్‌లో 3 సిక్స్‌లు, 3 ఫోర్లతో.. 6 బంతుల్లో 6 బౌండరీలు బాది 22 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ప్రమాదకరంగా మారిన అతన్ని వరుణ్ చక్రవర్తి ఔట్ చేశాడు. బ్రెవిస్ ఔటైనా.. శివమ్ దూబే- ధోనీ ఆచితూచి ఆడారు. 19వ ఓవర్‌లో భారీ షాట్ ఆడే క్రమంలో దూబే, నూర్ అహ్మద్ ఔటవ్వగా.. ఆఖరి ఓవర్‌లో చెన్నై విజయానికి 8 పరుగులు అవసరమయ్యాయి. రస్సెల్ వేసిన ఈ ఓవర్ తొలి బంతినే ధోనీ భారీ సిక్సర్ బాది విజయాన్ని ఖాయం చేశాడు. అన్షుల్ కంబోజ్ బౌండరీ బాది మ్యాచ్‌ను ముగించాడు. దాంతో నిర్ణీత 19.4 ఓవర్లలో 8 వికెట్లకు 183 పరుగులు చేసి గెలుపొందింది. డెవాల్డ్ బ్రెవిస్(25 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 52) హాఫ్ సెంచరీతో రాణించగా.. అరంగేట్ర ప్లేయర్ ఉర్విల్ పటేల్(11 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 31), శివమ్ దూబే(40 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 45 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. కేకేఆర్ బౌలర్లలో వైభవ్ అరోరా(3/48) మూడు వికెట్లు తీయగా.. హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి రెండేసి వికెట్లు పడగొట్టారు. మొయిన్ అలీకి ఓ వికెట్ దక్కింది.

# భారత్, పాక్ మధ్య ఉద్రిక్తత.. ఐపీఎల్‌పై ఎఫెక్ట్



- **ధర్మశాల విమానాశ్రయం మూసివేత**
- **ప్రశ్నార్థకంగాఆటగాళ్ల ప్రయాణం**

**బలగం టీవి, హైదరాబాద్**

భారత్ పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణపై ప్రభావం చూపనున్నట్లు తెలుస్తోంది. గత నెల 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత త్రివిధ దళాలు మంగళవారం ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్థాన్‌లోని ఉగ్రవాదుల శిబిరాలపై మెరుపు దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో సుమారు 80 మంది ఉగ్రవాదులు మృతి చెందినట్లు తెలుస్తోంది. అయితే ఈ ఆపరేషన్ నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధం జరిగే అవకాశాలు కూడా ఉన్నాయి.

ఇక ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో పాకిస్థాన్ సరిహద్దులకు సమీపంగా ఉండే 18 విమానాశ్రయాలను భారత ప్రభుత్వం తాత్కలికంగా మూసి వేసింది. ఇందులో ధర్మశాలతో పాటు ఛండీఘడ్, అమృత్ సర్, జమ్మూ, శ్రీనగర్ కూడా ఉన్నాయి. పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీకి ధర్మశాల మైదానం రెండో హోమ్ గ్రౌండ్‌గా ఉంది. ఇప్పటికే ఇక్కడ ఒక మ్యాచ్ జరిగింది. మరో రెండు మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. మే8న(నేడు) పంజాబ్-ఢిల్లీ, మే 11న పంజాబ్-ముంబై మ్యాచ్‌లు నిర్వహించాల్సి ఉంది. ధర్మశాల విమానాశ్రయం మూసివేత నేపథ్యంలో ఆటగాళ్ల ప్రయాణం ప్రశ్నార్థకంగా మారింది. ఆటగాళ్లు రోడ్డు మార్గం ద్వారా ధర్మశాల చేరినా.. బ్రాడ్‌కాస్టర్ సిబ్బంది, టీవీ క్రూ, ఇక్విప్‌మెంట్ తరలింపు సమస్యగా మారనుంది.

గురువారం జరిగే మ్యాచ్ కోసం పంజాబ్, ఢిల్లీ జట్లు ఇప్పటికే ధర్మశాలకు చేరుకున్నాయి. అయితే నేడు మ్యాచ్ జరుగుతుందా? లేక వాయిదా వేస్తారా? అనేది తెలియాల్సి ఉంది. లేదా ఈ రెండు మ్యాచ్‌లను వాయిదా వేసి ఇతర వేదికల్లో నిర్వహిస్తారా? అనేది చూడాలి. ఇదిలా ఉండగా ఐపీఎల్ షెడ్యూల్ ప్రకారమే యాథావిధిగా కొనసాగుతుందని, ఆపరేషన్ సింధూర్ ప్రభావం మ్యాచ్‌లపై పడదని బీసీసీఐ వర్గాలు వెల్లడించినట్లు సమాచారం. కానీ పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉండే ధర్మశాల వేదికగా జరిగే మ్యాచ్‌ల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి.

# ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలోనే జడేజా

**బలగం టీవి, హైదరాబాద్**



ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో ఆల్ రౌండర్స్ జాబితాలో భారత స్టార్ స్పిన్నర్ రవీంద్ర జడేజా అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు. 400 రేటింగ్ పాయింట్స్‌తో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. బంగ్లాదేశ్ క్రికెటర్ మెహిదీ హసన్ మిరాజ్ ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని రెండో స్థానానికి చేరుకున్నాడు. ఐసీసీ అఫీషియల్ వెబ్‌సైట్‌లో బుధవారం తాజా ర్యాంకింగ్స్‌ను పొందుపర్చారు. ఇటీవల జింబాబ్వేతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో మిరాజ్ 116 పరుగులు రాబట్టడమేగాక, 15 వికెట్లు తీశాడు. దాంతో ఆల్‌రౌండర్స్ జాబితాలో అతను ఒక స్థానాన్ని మెరుగుపర్చుకున్నాడు. అంతేగాక రెండో టెస్టులో సెంచరీ ద్వారా మిరాజ్.. ఐసీసీ బ్యాటర్స్ జాబితాలో కూడా 8 స్థానాలు మెరుగుపర్చుకుని 55వ స్థానానికి చేరుకున్నాడు.

# ఓటీటీలోకి నితిన్ రాబిన్‌హుడ్..


**బలగం టీవి, హైదరాబాద్**




టాలీవుడ్ యువ నటుడు నితిన్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం రాబిన్‌హుడ్. ఈ సినిమాకు వెంకీ కుడుముల దర్శకత్వం వహించగా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు వచ్చి మిశ్రమ స్పందనలను తెచ్చుకుంది. అయితే ఈ చిత్రం తాజాగా ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక 'జీ 5' 'సంక్రాంతి వస్తున్నాం' సినిమాను ఎలా అయితే అటు ఛానల్‌లో, ఇటు ఓటీటీలో విడుదల చేసిందో అచ్చం అలానే రాబిన్ హుడ్‌ని కూడా తీసుకురాబోతుంది. రాబిన్‌హుడ్ టీవీ ప్రీమియర్ మే 10న సాయంత్రం 6 గంటలకు ప్రారంభంకాబోతుండగా.. అదేరోజు ఓటీటీలోకి విడుదల చేయబోతుంది చిత్రయూనిట్.

# రెట్రోకు రూ.100 కోట్లు

**బలగం టీవి, హైదరాబాద్**




సూర్య నటించిన రెట్రో చిత్రం తాజాగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ యాక్షన్ డ్రామాలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించగా, శ్రియ ప్రత్యేక గీతంలో కనిపించారు. 65 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మించారు. మే 1న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం ఫస్ట్ షో నుంచే మిశ్రమ స్పందనలను అందుకున్న విషయం తెలిసిందే.తాజాగా ఈ చిత్రం రూ.100 కోట్ల క్లబ్‌లో చేరినట్లు చిత్రబృందం ప్రకటించింది.

# కాంతార 2 షూటింగ్‌లో విషాదం..

- **నదిలో కొట్టుకుపోయి నటుడు మృతి**

**బలగం టీవి, హైదరాబాద్**

కాంతార 2 షఉటింగ్‌లో విషాదం చోటు చేసుకుంది. కేరళకు చెందిన కపిల్ (32) అనే నటుడు ఉడుపి జిల్లాలోని కొల్లూరు సమీపంలో ప్రవహించే సౌపర్ణిక నదిలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. కాంతారా 2 సినిమా చిత్రీకరణ ముగిసిన తర్వాత కపిల్ తన స్నేహితులతో కలిసి సౌపర్ణిక నదిలో ఈతకు వెళ్లాడు. అయితే, దురదృష్టవశాత్తు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. వెంటనే అక్కడున్న వారు సహాయక చర్యలు చేపట్టినప్పటికీ, కపిల్‌ను రక్షించలేకపోయారు. ఈ సంఘటనతో కాంతారా 2 చిత్ర బృందం తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. మరోవైపు కొల్లూరు పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.